# ముట్టడి

★

అంబటిపూడి వెంకటనరసింహం

అకస్మాత్తుగా అర్జంటు ప్రయాణం ఒకటి నాకు తగిలింది. అదైనా విసుగు కలిగించే ప్రయాణం. రైలు ప్రతిరోజూ సాధారణంగా ఒకగంట లేటు అని తెలిసి కూడా టైముకు పావుగంట ముందుగానే స్టేషనుక్కు చేరుకున్నాను. అనుకున్నట్లుగనే ఆరోజు బండి 4 నిముషాలు లేటు అని తెలిసింది. సరే యిక్కడికే యింత లేటు అయితే నే వెళ్ళదలుచుకునే వూరు చేరే వరకు ఎంత లేటవుతుందో అని అనుకుంటూ యీ విసుగు ప్రయాణానికి ఏదయినా పుస్తకం కొనుక్కుని చదువుకుంటూ రైలులో కూర్చుంటే కొంత ఉబుసుపోతుంది కదా అని హిగిన్ బాదమ్స్‌లో ఒక దీపావళిసంచిక ఒకరూపాయి యిచ్చి కొనుక్కుని రైలెక్కాను. సంచిక దళసరిగనే ఉన్నది. పేజీలు త్రిప్పిచూశా. చదువుకునేందుకు ఎన్నో విషయాలున్నాయి, ఫర్వాలేదు అనుకుని వెంటనే చదవడం ప్రారంభిస్తే నా ప్రయాణం పూర్తికాకమునుపే పుస్తకం చదవటం పూర్తి అయిపోతుందనే భయంతో విసుగుపుట్టినపుడు చదువుకోవచ్చని సంచిక హేటుక్రింద పదిలంగా పెట్టి నా జాగాలో కూర్చున్నాను. ప్రతి స్టేషనులోను ప్యాసింజర్ల త్రోపులాటలు, టీ, కాఫీ, పాన్, సిగరెట్టు వాలాల కేకలుతోను ఒక గంట గడచిపోయింది. ఎక్కే ప్యాసింజర్లను ఎక్కించుకుంటూ దిగే వాళ్ళను దింపేస్తూ ఏచీకు చింతా లేకుండా, అలుపు అయినా లేకుండా రైలు దానిమానాన్న అది పరుగెట్తోంది.

ఇంతలో నా యెదురుగా కూర్చున్న ఒకాయని నేను హేటు క్రింద పుస్తకం పెట్టడం చూశాడో ఏమో—

"తమరాపుస్తకం ఒక్కసారి యివ్వగలరా?" అని అడిగాడు. తప్పక నిర్మొహమాటంగా యివ్వను అని చెప్పలేక పదిలంగా దాచిన మేగజయిను ఆయన చేతిలో పెట్టాను.

ఇరవై, ఇరవైఅయిదునిమిషాలు గడచి పోయినా ఇంకా ఆ పెద్దమనిషి అట్లా చదువుతునే ఉన్నాడు. ఇంక వుండబట్టక నేనే మర్యాదగా అడిగి తీసుకుందామనుకున్నాను గాని ఆయన దిగి పోయే స్టేషను రావడంవల్ల నా పుస్తకం నా చేతిలో పెట్టేసి లేచి పోయాడు. బ్రతికేమురా దేవుడా ఇంక చదువుదామని అనుకుంటూండగనే "దయచేసి ఒక్క రెండు నిముషాలు ఆ మేగజయిను నాకిప్పిస్తారా?" అంటూ ఆ ప్రక్కనే కూర్చున్న ఇంకో ఆయన అకస్మాత్తుగా అడిగేడు.

నాకు బలే కోపం వచ్చింది. అంతగా పుస్తకాలంటే అమాంతంగా చదివేద్దామనే యీ పెద్ద మనుష్యులు, ఏం? కొనుక్కోరాదూ? ఇటువంటి పీనార్లు చదువుతారనేనా మాలాంటివాళ్లు పుస్తకాలు కొనుక్కునేది. ఒక కానీ ఖర్చులేకుండా ముష్టెత్తి చదివేద్దామనా?

"ఇవ్వను" అని స్పష్టంగా చెప్పివేద్దామనుకున్నాను. కాని నాలోవున్న పెద్దమనిషి నన్నట్లా అననివ్వలేదు. పోనీ పెద్దమనిషితరహాగనే

'వీలు కాదండీ, నేనిప్పుడిది చదవాలనుకుంటున్నాను. క్షమించండి' అని అంటే ఆ పెద్దమనిషి ఏమనుకుంటాడు. 'ఇందాకటాయన చుట్టమైనాడా నేను కాక పొయ్యానా? ఆయనకు ఒక గంటసేపు చదువుకుందికిచ్చినే వొక్క రెండు నిమిషాలు పేజీలు త్రిప్పివేస్తానంటే వీలు లేదని నిర్మొహమాటంగా చెప్పివేస్తున్నాడే

మర్యాదలేని మనిషి' అని తప్పక అనుకుంటాడు. విధిలేక నా చేతిలోని సంచిక ఆయనకు సమర్పించి నా జాగాలో కూలబడ్డాను. ఆయన నా పుస్తకం ఎప్పుడిస్తాడా అని ఆలోచిస్తూ బల్లకు జేరబడ్డాను ఆ ఆలోచనలో నే చిన్న కునుకు పట్టిపోయింది. నేను జాగ్రతావస్థలోకి వచ్చేవరకు ఒక అరగంట గడిచిపోయింది. నా సంచిక తీసుకుని చదువుతూన్న ఆసామీ తన జాగాలో లేడు. కళ్లుగట్టిగానులుముకుని ఆ పెట్టెలో చుట్టూ చూశాను. కాని అతను ఎక్కడా లేడు ఖర్మం. భోగట్టామీద ఆ ఆసామీ దిగిపోయేకా మరి రెండు స్టేషనులు కూడా దాటిపోయేయని తెలిసింది. నా సంచిక పెట్టెలోని వారలకు యెవరికేని యిచ్చాడేమో అని అడిగాను. కాని ఎవరు కూడా మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. యింతలో హఠాత్తుగా నా దృష్టి కొసా బెంచీమీద మూలగా కూర్చుని అదే సంచిక చదువుతో వున్న మనిషిమీద పడింది. అతడు తన చుట్టు ప్రక్కల యేమి జరుగుతుందో గమనించకుండా నే దీక్షగా చదువుతున్నాడు.

'అదుగో! ఆయనవద్దవుంది, నేను గట్టిగా అన్నాను.

'క్షమించండి' నేను మర్యాదగా అడిగాను

"తమరు చదవడం అయిపోతే నా మేగజీ నాకు యిప్పిస్తారా?"

'క్షమించడయ్యా' అతను కూడా సరిసమానమైన మర్యాదగ నే జవాబిచ్చాడు.

'కాని యిది నాది కావాలంటే మీరొకసారి చదివిచ్చేయండి.

'అక్కడ కూర్చొన్న ఒక పెద్దమనిషికి నేనిచ్చాను అతను దిగిపోతూ బహుశా మీకో యింకెవరికో యిచ్చి '

"అయివుండొచ్చు-కాని నాకివ్వలేదు-యిది మాత్రం మీది కాదు-కావాలంటే చూసి యిచ్చేయండి"

ఈయన యింత చెప్తున్నప్పటికీ ఆ సంచిక నాదే అనే నా నమ్మకం పోలేదు. ఆ సంచిక రెండవ పేజీలో నా పేరు కూడా రాసుకున్నాను.

'మంచిదే. యీ సంచిక నాదే అని రుజువు చేస్తాను'

"రుజువు చెయ్యండి"

నేను ఆయన చేతిలో వున్న సంచిక తీసుకొని కవరు పేజి తిప్పాను. కొయ్యకట్టుకపొయ్యా నేను నా పేరు వ్రాసుకున్న స్థలంలో నా పేరు లేదు.

'నాది పొరపాటండీ' నేను యేడుపు గొంతుతో తొందరగా క్షమాపణ కోరాను.

'చాలా పొరపాటే, అక్కడ నాకు ఎదురుగా కూర్చున్న ఒక వాజెమ్మకు నా సంచిక యిచ్చాను ఆ బద్మాయిగాడు అది పట్టుక వుడాయించేశాడు. ఛీ దొంగజన్మ"

'నన్ను క్షమించండి. మీ పుస్తకం ఎవరూ పట్టుకపోలేదు' అంటూ అతను నవ్వసాగాడు.

'ఈ సంచిక మీదే, యింత స్వతంత్రంగా ప్రవర్తించి యింతవరకు అల్లరి పెట్టినందుకు నన్ను క్షమించండి' ఆ పెట్టెలోని అందరికళ్ళూ మాపై కేంద్రీకరించాయి. ఆ పెద్దమనిషి తన సంచిలో నుండి ఒక అట్టపెట్టె తీసి చేతితో పట్టుకొని నన్ను మరొకసారి క్షమాపణ కోరుకుని ఆ పెట్టె తెరచి అందులో (యింక్ యెరేజర్స్) సిరాపేరు చెరుపుకున్న రబ్బర్లు చూపిస్తూ తన రబ్బరు కంపెనీ ఎటువంటి సిరా అయినా సగం చెరిపేసే రబ్బర్లు తయారు చేస్తుందని తెలియజేశాడు. నేను ఒక రబ్బరు కొనుక్కున్నాను. ఇంకా యేడెనమండుగురు కూడా కొన్నారు. యెవరో స్కూలు మాస్టరు అతను స్కూలు కోసం ఒక గ్రోసు రబ్బర్లకు ఆర్డరు యిచ్చాడు.

ఆ రిప్రజెంటేటివ్ నాకు మరొకసారి వందనాలు చెప్పేసి పక్క స్టేషన్‌లో మరొక కంపార్టుమెంటులోకి వెళ్లిపోయాడు. నేను నా రబ్బరు నా సంచిక తీసుకుని నా జాగాలో కూలబడ్డాను యెప్పటికైనా నేను వెళ్ళవలసిన వూరు లేటు కాకుండా చేర్తానా లేదా అని-